

'రెడ్‌క్రాస్'లో తలసేమియా బ్లాక్‌ను ప్రారంభిస్తున్న గవర్నర్



హనుమకొండ కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, వేదికపై మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, కలెక్టర్లు, అధికారులు

సుస్థిరాభివృద్ధిపై దృష్టి పెట్టాలి

- అప్పుడే అసలైన ప్రగతి సాధ్యం
- వ్యవసాయంలో సౌరశక్తి వినియోగాన్ని ప్రోత్సహించాలి
- మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి
- ఎస్‌హెచ్‌జీలను బలోపేతం చేయాలి
- ఓరుగల్లు విశిష్టమైన నగరం
- కాకతీయుల కట్టడాల సందర్శనతో దివ్యానుభూతి
- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- నగరంలో విస్తృత పర్యటన
- కలెక్టరేట్‌లో అధికారులు, కవులు, కళాకారులతో భేటీ
- సంక్షేమ పథకాల అమలుపై ఆరా
- హాజరైన మంత్రులు పొంగులేటి, సీతక్క, పొన్నం ప్రభాకర్

హనుమకొండ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల అమలుతో పాటు సుస్థిరాభివృద్ధిపై దృష్టి పెట్టాలని అప్పుడే అసలైన ప్రగతి సాధ్యమవుతుందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. మూడురోజుల ఉమ్మడిజిల్లా పర్యటనలో భాగంగా రెండో రోజు బుధవారం హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో విస్తృతంగా పర్యటించారు. మంగళవారం ములుగు, జయశంకర్‌భూపాలపల్లి జిల్లాల్లో పర్యటించిన ఆయన లక్నవరం టూరిజం కాటేజీలో బస చేశారు. బుధవారం ఉదయం అక్కడి నుంచి హనుమకొండ చేరుకుని.. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హనుమకొండ కలెక్టరేట్‌లో అధికారులు, కవులు, రచయితలు, కళాకారులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతో భేటీ అయ్యారు. వరంగల్, హనుమకొండ జిల్లాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ తిలకించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని, అది సుస్థిరమైనప్పుడే ఆశించిన ఫలితాలు దక్కుతాయని, ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయన్నారు. అధికారుల కర్తవ్య నిర్వహణ ఈ దృష్టి కోణం నుంచే జరగాలని ఉద్బోధించారు. అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవడం, జలవనరులను కాపాడుకోవడం, వ్యర్థాల నుంచి పునరుత్పాదకత సాధన, ఇంధన వనరుల పొదుపు వాడకం వంటి వాటి ద్వారా సుస్థిరాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సేంద్రియ వ్యవసాయంపై ప్రధానంగా దృష్టి సారించాలని కోరారు. పీఎం కుసుమ్ యోజన పథకం గురించి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో సౌరవిద్యుత్ వాడకాన్ని ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన ఈ పథకం అమలు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎలా జరుగుతోందని ఆరా తీశారు. అందుకు కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ఈ పథకం అమలుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నీటిపారుదల రంగంలో సౌరవిద్యుత్ వాడకాన్ని పెంచాలని గవర్నర్ జిష్ణు దేవ్ కోరారు. తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇస్తోందని, ఈ క్రమంలో విద్యుత్ వాడక భారాన్ని తగ్గించేందుకు రైతులు కుసుమ్ యోజన పథకం కింద సౌర విద్యుత్ కనెక్షన్లను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ)ను బలోపేతం చేసే దిశగా కృషి జరగాలని గవర్నర్ సూచించారు. ఎస్‌హెచ్‌జీలను మరింత క్రియాశీలకంగా మార్చడం స్వచ్ఛభారత్‌లాగా ఒక ఉద్యమంలాగా సాగాలన్నారు. కొన్ని ఈ కామర్స్ సంస్థల వల్ల ఎస్‌హెచ్‌జీ ఉత్పత్తులు మార్కెట్‌లో పోటీని తట్టుకొని నిలబడలేకపోతున్నాయని, ఈ క్రమంలో ఎస్‌హెచ్‌జీ ఉత్పత్తుల మార్కెట్ విస్తరణకు ప్రత్యేక చర్యలు తీసుకోవలసి ఉందన్నారు. ఈ క్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌హెచ్‌జీల ఉత్పత్తుల విక్రయానికి హైదారాబాద్‌లో ఒక విశాలమైన మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకొస్తోందని గవర్నర్‌కు వివరించారు.



భద్రకాళి దేవాలయంలో గవర్నర్ పూజలు



వేయి స్తంభాల దేవాలయంలో..

అభివృద్ధిపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్

వరంగల్, హనుమకొండ కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, ప్రావీణ్య.. రెండు జిల్లాల అభివృద్ధికి చేపడుతున్న చర్యలు, జరుగుతున్న పనులు, విద్య, వైద్యం, ఎంజీఎం ఆస్పత్రి అభివృద్ధి, ఐసీడీఎస్, వ్యవసాయం, ఏనుమాముల మార్కెట్ తదితర శాఖల గురించిన వివరాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అంగన్వాడీ కేంద్రాల ఉన్నతీకరణ విధానం, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, దేవాలయాలు, పర్యాటక ప్రదేశాలు, జాతీయ రహదారులు, స్మార్ట్ సిటీ పనులు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, విపత్తుల నిర్వహణ, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ప్రతిపాదిత కూరగాయల మార్కెట్లు, పారిశుధ్య

మిగతా 7వ పేజీలో..



కోటలో పేరిణి నృత్య ప్రదర్శనను తిలకిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

రేపు 'దేవాదుల'కు మంత్రి ఉత్తమ్ రాక



ములుగు, ఆగస్టు 28: సాగునీటి ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ములుగు జిల్లాకు రానున్నారు. కన్నాయిగూడెం మండలంలోని దేవాదుల ప్రాజెక్టు పంప్‌హౌస్, తుపాలకుగూడెంలోని సమ్మక్క బ్యారేజీని సందర్శిస్తారు. ఉదయం 9 గంటలకు దేవాదులకు హెలిక్యాప్టర్ ద్వారా చేరుకోనున్న మంత్రి ఈ రెండు ప్రాజెక్టులను పరిశీలించిన తర్వాత సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమై పలు అంశాలను సమీక్షిస్తారు. మధ్యాహ్నం 12గంటలకు తిరుగు ప్రయాణమవుతారు. మంత్రి పర్యటన కోసం జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.

గణేష్ మండపాలకు అనుమతి తీసుకోవాలి

- ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్



మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 28: గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసుకునే మండపాలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా గణేష్ నవరాత్రులను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ప్రజలకు సూచించారు. గణేష్ విగ్రహాల ఏర్పాటు, ప్రదేశం, నిమజ్జనం తేదీ తదితర సమాచారంతో పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీసు పెట్రోకాల్ వెబ్‌సైట్ https://policeportal.tspolice.gov.in ద్వారా మండపాల నిర్వాహకులు పూర్తి వివరాలు నమోదు చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అనంతరం సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులు ఆన్‌లైన్

మిగతా 8వ పేజీలో..

సమగ్రశిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

- ఎస్ఎస్ఏ అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షుడు సహదేవ్



నెహ్రూసెంటర్‌లో మానవహారం నిర్వహిస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 28: రాష్ట్ర విద్యాశాఖ సమగ్రశిక్షలో 15 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలని సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షుడు రేగుల సహదేవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లో సమగ్రశిక్ష ఉద్యోగుల జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి భారీ ర్యాలీ చేపట్టి నెహ్రూసెంటర్‌లో మానవహారం నిర్వహించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి ముఖ్యమంతి రేవంత్‌రెడ్డి గతంలో పీసీసీ అధ్యక్షుడి హోదాలో సమగ్రశిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మె శిబిరాలను సందర్శించి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరిస్తామని చెప్పారన్నారు. గత 15ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ప్రతిపక్ష హోదాలో ఇచ్చిన హామీని అమలు చేసి 18వేల కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. ఈ దీక్షా శిబిరానికి వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు షైన శ్రీనివాస్, ఉపేందర్, యాకూబ్ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేశం, జానకీరాములు, ఖాదర్, వీరన్న, రవి, మంజుల, ఐఈఆర్పీలు, సీఆర్పీలు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు, మెసెంజర్లు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలి

- సమీక్షలో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



జిల్లా ప్రధాన ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

మహబూబాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): అధికారులు క్షేత్ర స్థాయిలో గ్రామాలు, పట్టణాల్లో పర్యటించి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశించారు. మహబూబాబాద్‌లోని కలెక్టరేట్‌లో బుధవారం పంచాయతీ, వైద్యశాఖ అధికారులతో సీజనల్ వ్యాధులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ నియంత్రణకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికున్‌గున్యా, టైఫాయిడ్, ఫీవర్ కేసుల నమోదు వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులను అరికట్టవచ్చన్నారు. గ్రామాల్లో నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి నీరు నిల్వ ఉండకుండా చేసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్య సిబ్బంది మురుగు కాల్వలను శుభ్రపరిచి, ప్లాస్టిక్‌ను నిరోధించాలని, వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్, ఫాగింగ్ చేపట్టాలన్నారు. ప్రతి శుక్రవారం, మంగళవారం డ్రైడేగా పాటించాలన్నారు. సంక్షేమ హాస్టళ్ల, పాఠశాలల్లో పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలని, వంటచేసే ముందు కూరగాయలను కడగాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసు కోవాలన్నారు. జిల్లా ఆస్పత్రి, పీహెచ్‌సీల్లో అవసరమైన మందులు అం దుబాటులో ఉండే విధంగా చూడాలన్నారు. అవసరమైన చోట వైద్య శి బిరాలను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లెని న్‌వత్సల్‌టొప్పో, డీఎంహెచ్‌వో మురళీధర్, జిల్లా అధికారులు నర్మద, డాక్టర్ ప్రమీలరావ్, హరిప్రసాద్, విజయకుమారి, రామకృష్ణ పాల్గొన్నారు.

కంట్రోల్ రూంను తనిఖీ చేసిన కలెక్టర్

మహబూబాబాద్‌లోని జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంను కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ తనిఖీ చేశారు. కలెక్టరేట్‌లోని మొందటి అంతస్తులో ఉన్న వైద్యాధికారి కార్యాలయంలో సీజనల్ వ్యాధులపై ఫిర్యాదుల కోసం ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంను సందర్శించారు. రిజిస్టర్‌ను పరిశీలించి జిల్లాలోని పలు ప్రాంతాల్లో నమోదైన కేసుల వివరాలు, సిబ్బంది తీసుకునే చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. కంట్రోల్ రూం ద్వారా వచ్చిన ప్రతి ఫిర్యాదు స్థితిని నమోదు చేసి సంబంధిత ప్రాంతాల సిబ్బందిని అప్రమత్తం చేసి వ్యాధుల నివారణకు వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో, డీఎంహెచ్‌వో మురళీధర్, ఉప వైద్యాధికారి ప్రమీలరావ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీ..

పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్జికల్, జనరల్ మెడిసిన్, వివిధ వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగుల వివరాలను తెలుసుకున్నారు. రోగుల వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వారి కేస్‌షీట్‌లను పరిశీలించి అందిస్తున్న వైద్యాన్ని డాక్టర్లను అడిగారు. సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగీ, ఇతర వ్యాధుల పట్ల అప్రమత్తమై రోగులకు ఇబ్బందులు కలుగకుండా వైద్య సేవలందించాలని సూచించారు. ఆస్పత్రిలోని పలు వార్డుల్లో ఉన్న మందులను పరిశీలించారు. ఆస్పత్రి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణ డయాగ్నొస్టిక్ సెంటర్‌ను పరిశీలించి ప్రతిరోజు ఎన్ని టెస్టులు చేస్తున్నారని, ఎక్కువగా ఎక్కడ్నుంచి శాంపిల్స్ వస్తున్నాయని తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, ఆర్ఎంవో జగదీష్ పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

- 21 కిలోల ఎండు గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన టౌన్ సీఐ దేవేందర్

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 28: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం 21.8 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఓసీ క్లబ్ వద్ద పెట్రోలింగ్ చేస్తుండగా మహారాష్ట్ర న్యూ ముంబయిలోని సిద్ధార్థనగర్‌కు చెందిన పప్పు కుమార్‌సింగ్, ముంబయిలోని పీఎంజీపీ కాలనీకి చెందిన మహిళ హీన హుస్సేన్ అన్సారీ చిన్నపిల్లలతో అనుమానాస్పదంగా కనిపించారు. అదుపులోకి తీసుకుని విచారించి వారి వద్ద ఉన్న రెండు బ్యాగులను తనిఖీ చేశారు. ఆ బ్యాగుల్లో 13 ప్యాకెట్ల ఎండు గంజాయి లభ్యమైనట్లు చెప్పారు. వాటి విలువ సుమారు రూ.5.45 లక్షలు ఉంటుందని తెలిపారు. గంజాయిని ఒడిషా రాష్ట్రం భువనేశ్వర్‌కు చెందిన రాము వద్ద కొనుగోలు చేసి మహారాష్ట్రకు చెందిన రహీంకు విక్రయించేందుకు కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో మంగళవారం తరలిస్తున్నారన్నారు. రైలులో పోలీసులు తనిఖీలు చేస్తుండగా భయంతో మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో దిగి ఇక్కడే బస చేశారు. తిరిగి బుధవారం మహారాష్ట్రకు వెళ్లేందుకు కోణార్క్‌కు వెళ్లే క్రమంలో పోలీసులు తనిఖీలు చేస్తుండగా స్థానిక ఓసీ క్లబ్ వద్ద పప్పు కుమార్‌సింగ్, మహిళ హీన హుస్సేన్ అన్సారీ అనుమానాస్పదంగా పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి రూ.5.45 లక్షల విలువైన 21.8 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, ఎస్సై విజయ్‌కుమార్, సిబ్బందిని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్, డీఎస్పీ తిరుపతిరావులు అభినందించారు.

రోహిణి ఆస్పత్రిపై ఆరోపణలు నిరాధారం

వరంగల్ మెడికల్, ఆగస్టు 28: సీఎం రిలీఫ్ ఫండ్ నిధులను స్వాహా చేసినట్లు తమపై వచ్చిన ఆరోపణలను రోహిణి ఆస్పత్రి యాజమాన్యం తీవ్రంగా ఖండించింది. హనుమకొండ సుబేదారిలోని రోహిణి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, డైరెక్టర్లు డాక్టర్ క్రాంతిరావు, డాక్టర్ బుచ్చిరెడ్డి, డాక్టర్ బోస్ బుధవారం విలేఖర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ మధ్య తమ ఆస్పత్రిపై వస్తున్న కథనాలను, సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. తమపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 2023 మే మాసంలోనే విచారణ అధికారులు తమ ఆస్పత్రిని సందర్శించారని, బిల్లులను తనిఖీ చేశారని పేర్కొన్నారు. ఆరోపణల్లో చూపబడిన బిల్లులు ఆస్పత్రికి సంబంధించినవి కాదని రికార్డుల ద్వారా స్పష్టం చేశామని తెలిపారు. అదే విధంగా ఆ బిల్లులో పేర్కొన్న రోగులు ఎవరూ ఆస్పత్రి అడ్మిట్ కార్డుల్లో లేరని విచారణ అధికారులకు స్పష్టం చేశామన్నారు. ఆ బిల్లులో చికిత్స చేసినట్లు చెబుతున్న వైద్యులు కూడా తమ ఆస్పత్రిలో ఏనాడు పనిచేయలేదని చెప్పారు. ఉమ్మడి వరంగల్ ప్రజలందరూ ఇలాంటి ఆరోపణలు నమ్మవద్దని వారు కోరారు.



మీడియాతో మాట్లాడుతున్న రోహిణి ఆస్పత్రి యాజమాన్యం

పాడి గేదెలను అపహరించిన దొంగలు

మడికొండ, ఆగస్టు 28: పాడి గేదెలను దొంగలు అపహరించిన ఘటన కాజీపేట మండలం రాజీవ్ గృహకల్ప(కడిపికొండ) వద్ద జరిగింది. మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజీవ్ గృహకల్ప వద్ద కొంతకాలంగా షఫియుద్దీన్ అనే రైతు కాకతీయ గేదెల డెయిరీ ఫామ్ నిర్వహిస్తున్నాడు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తుతెలియని వ్యక్తులు డెయిరీ ఫామ్‌లోని రెండు పాడి గేదెలను ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న రైతు.. బుధవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధిత రైతు ఫిర్యాదుతో వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న ఇన్‌స్పెక్టర్ కిషన్, ఎస్సై రాజబాబు బాధితుడి నుంచి వివరాలు తెలుసుకున్నారు. గేదెల విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని తెలిపారు. త్వరలోనే నిందితులను పట్టుకొని గేదెలను స్వాధీనం చేసుకుంటామని ఇన్‌స్పెక్టర్ కిషన్ స్పష్టం చేశారు.

కేయూ పీహెచ్‌డీ అడ్మిషన్లకు హైకోర్టులో చుక్కెదురు

కేయూ క్యాంపస్, ఆగస్టు 28: కాకతీయ యూనివర్సిటీ కేటగిరీ 1, 2 అడ్మిషన్లను వెంటనే నిలిపివేయాలని రాష్ట్ర హైకోర్టు బుధవారం మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. గతంలో నిర్వహించిన పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షల ఆధారంగా ఇప్పుడున్న సీట్లను భర్తీ చేయడంపై హైకోర్టు అభ్యంతరాలను వ్యక్తం చేసింది. అడ్మిషన్లలో పారదర్శకత, లేదని కాకతీయ యూనివర్సిటీ ఇంజనీరింగ్ విద్యార్థి చల్లా అమరేందర్‌రెడ్డి కోర్టుమెట్లెక్కారు ఆయన అప్పీల్‌తో స్పందించిన హైకోర్టు.. తమ తదుపరి ఉత్తర్వులు వెల్లడించే వరకు ఎలాంటి పీహెచ్‌డీ ప్రవేశాలు చేపట్టరాదని కరాఖండిగా హైకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. కాగా, 2020-2021 ఏడాదిలో కేయూ అన్ని విభాగాల్లో పీహెచ్‌డీ అడ్మిషన్లకు నోటిఫికేషన్ జారీ చేసింది. అప్పట్లో జారీ చేసిన నోటిఫికేషన్ ఆధారంగా ఇప్పటివరకు ఖాళీగా ఉన్న పీహెచ్‌డీ సీట్లను భర్తీ చేయాలని కేయూ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇది వివాదాస్పదమైంది, కేటగిరీ, 1, 2 అడ్మిషన్లలో పారదర్శకత లేదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ క్రమంలో హైకోర్టు అడ్మిషన్లకు మోకాలడ్డటంతో కేయూలో చర్చనీయాంశమైంది. దీంతో విద్యార్థులు కేయూ దూర విద్య కేంద్రం ఎదుట ఆందోళనలు, దీక్షలు చేపట్టారు. అదే క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థుల వద్దకు వచ్చి ఇచ్చిన హామీ మేరకు వర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్లు నిర్వహించాలని వర్సిటీ అధికారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. తాజాగా హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులతో అడ్మిషన్ల ప్రక్రియ సందిగ్ధంలో పడింది.

కేయూ డిగ్రీ పరీక్షల ఫలితాల విడుదల

కేయూ క్యాంపస్, ఆగస్టు 28: కేయూ బీఏ, బీకామ్, ఇతర రెగ్యులర్ కోర్సుల 2, 4 సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు బుధవారం కేయూ రిజిస్టార్ చాంబర్‌లో రిజిస్టార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. రెండో సెమిస్టర్‌లో 28శాతం, నాలుగో సెమిస్టర్‌లో 36 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నర్సింహచారి, అదనపు పరీక్షల నియంత్రణ అధికారులు. డాక్టర్ ఎం.తిరుమలాదేవి, డాక్టర్ అసీం ఇక్బాల్, సమ్మయ్య, ఏఆర్ ఆర్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



కేయూ పరీక్షల ఫలితాలను విడుదల చేస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

సంస్కృతికి చిహ్నాలు పురాతన ఆలయాలు

● వేయిస్తంభాల ఆలయంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ● రుద్రేశ్వరుడికి ప్రత్యేక పూజలు



వేయిస్తంభాల ఆలయంలో గవర్నర్‌కు జ్ఞాపికను బహుకరిస్తున్న ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 28: దేశ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాచీన ఆలయాలు చిహ్నాలుగా విరాజిల్లుతున్నాయని, కోట్లాది మంది ప్రజల హృదయాల్లో కొలువైన రుద్రేశ్వరుడిని దర్శించుకోవడం గొప్ప అనుభూతి కలిగించిందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. బుధవారం సాయంత్రం మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, మేయర్ గుండు సుధారాణి తదితర ప్రముఖులతో కలిసి వేయిస్తంభాల ఆలయాన్ని సందర్శించిన గవర్నర్‌కు ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో మణికంఠ శర్మ, ప్రణవ్‌శర్మ, ఇతర వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తొలుత ఆలయానికి అభిముఖంగా ఉన్న శిల్పకళాశోభిత నందీశ్వరుడిని, ఉత్తిష్ఠ గణపతిని దర్శించి రుద్రేశ్వరుడి సన్నిధిలో శివ పంచాక్షరి మంత్రంతో బిల్వదళార్చన చేశారు. అనంతరం ఆలయ కల్యాణ మండపంలో వేద పండితులు గవర్నర్ ఇతర ప్రముఖులకు వేయిస్తంభాల ఆలయ సుందర చిత్రపటాన్ని బహూకరించారు. అనంతరం గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ బృందం ఇటీవల పూర్తయిన కల్యాణ మండపం అందాలను, పురావస్తుశాఖ అధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా ఆసక్తిగా తిలకించారు.

ఈ సందర్భంగా మీడియాతో గవర్నర్ మాట్లాడుతూ.. వేయిస్తంభాల గుడి లాంటి ఆలయాలను చరిత్ర మరుగున పడకుండా భవిష్యత్‌తరాల వారు తెలుసుకునేందుకు వీలుగా నిత్యనూతనంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆలయంలో శిల్పకళానైపుణ్యం అద్భుతమని, ఎందరో చిత్రకారులు, శిల్పులు అద్భుతంగా చెక్కిన రూపాలు అలనాటి కాకతీయుల ప్రతిభతో పాటు సమాజ శ్రేయస్సు చైతన్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయని కితాబిచ్చారు. సీనియర్ ఐఏఎస్ అధికారి వెంకటేశం, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సిరిసిల్ల రాజయ్య, ప్రొఫెసర్ పాండురంగారావు, హనుమకొండ కలెక్టర్ పి. ప్రావీణ్య, దేవాదాయ శాఖ ఉప కమిషనర్ శ్రీకాంత్‌రావు, పురావస్తు శాఖ అధికారి మల్లేశం, దేవాదాయశాఖ ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ రామాల సునిత, ఈవో వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు. ఆలయంలో గవర్నర్ బృందం అరగంట పాటు ఉల్లాసంగా గడిపింది.



వేయిస్తంభాల ఆలయంలో శిల్పకళను పరిశీలిస్తున్న గవర్నర్



కల్యాణమండపం నందీశ్వరుడి వద్ద గవర్నర్..

భద్రకాళికి గవర్నర్ పూజలు

వరంగల్ కల్చరల్, ఆగస్టు 28: వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారిని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ దర్శించుకున్నారు. ఉమ్మడి జిల్లాలోని చరిత్రాత్మక కట్టడాలు, ఆలయాల సందర్శనలో భాగంగా బుధవారం సాయంత్రం భద్రకాళి ఆలయానికి చేరుకున్న గవర్నర్‌కు ఆలయ ఈవో శేషు భారతి, ప్రధానార్చకులు భద్రకాళి శేషు, అర్చక బృందం, దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రావు, సహాయ కమిషనర్ రాయల సునీత స్వాగతం పలికారు. వేదమంత్రాలతో, మేళతాళాలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. తొలుత గవర్నర్ గణపతి స్వామిని దర్శించుకొని అమ్మవారి సన్నిధికి చేరుకున్నారు. ప్రధానార్చకులు గవర్నర్‌కు అమ్మవారి కుంకుమధారణ చేసి శేషవస్త్రాలు అందజేశారు. మంత్రులు ధనసరి అనసూయ సీతక్క, పొన్నం ప్రభాకర్, నగరమేయర్ గుండు సుధారాణి, 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య, మున్సిపల్ కమిషనర్ అశ్వినితానాజీ వాకడేలకు అమ్మవారి శేషవస్త్రాలను అందజేశారు. ఈవో శేషుభారతి అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాలను గవర్నర్‌కు అందజేశారు. అమ్మవారి చరిత్రను ప్రధానార్చకులు గవర్నర్‌కు ఆంగ్లంలో వివరించారు. అయితే షెడ్యూల్‌ప్రకారం గవర్నర్ సాయంత్రం 4గంటలకు దేవాలయానికి రావాల్సి ఉండగా 5గంటలకు వచ్చారు. దాదాపు 40 నిమిషాలు ఆలయంలో గడిపారు. గవర్నర్ రాక సందర్భంగా దేవాలయాన్ని పూలమాలలతో అరటి బోదెలతో అలంకరించారు.

అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉంది

భద్రకాళి అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని, దేవాలయ ప్రాంగణం ఆహ్లాదకరంగా కనిపిస్తోందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. భద్రకాళి అమ్మవారి దర్శనం అనంతరం ఖిలా వరంగల్ కోటకు వెళుతూ ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని అనేక చారిత్రక కట్టడాలు, ఆలయాలు, అభివృద్ధిని తిలకిస్తున్నానని, ఆలయాల సందర్శనం, సంస్కృతి, సంప్రదాయాలు, విశిష్టతలను తెలుసుకుంటున్నానన్నారు.



గవర్నర్‌కు భద్రకాళి అమ్మవారి చిత్రపటాన్ని బహుకరిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు



భద్రకాళి ఆలయంలో గోశాల వద్ద గవర్నర్..

కాకతీయుల కట్టడాలను ముందుతరాలకు అందించాలి



కళాతోరణం వద్ద గవర్నర్, మంత్రులు

ఖిలావరంగల్, ఆగస్టు 28: కాకతీయుల అద్భుత కళాఖండాలు, కట్టడాలను ముందుతరాలకు అందించాలని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. వరంగల్, హనుమకొండ జిల్లాల పర్యటనలో భాగంగా ఆయన బుధవారం సాయంత్రం వరంగల్ మధ్యకోటలోని కాకతీయుల కాలంనాటి కళాఖండాలు, కట్టడాలు, శిల్ప సంపదలను ఆసక్తిగా తిలకించారు. శిల్పాల ఆవరణలోని కాకతీయుల కీర్తితోరణం, రాతి కట్టడాలను తిలకించి పులకించారు. కీర్తితోరణం ముందు ఫొటోలు తీసుకున్నారు. అనంతరం స్వయంభూ - శంభులింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గవర్నర్‌కు కళాకారుడు గడ్డం సుధాకర్ బృందం బోనాలు, బతుకమ్మలు, కోలాటం డప్పుచప్పుళ్ల తదితర కళాకారుల నృత్యాలతో ఖుష్‌మహల్ నుంచి శిల్పాల వరకు స్వాగతం పలికారు. ఆవరణలో పేరిణి శివతాండవాన్ని గజ్జెల రంజిత్ బృందం, చిందు యక్షగానం గజవెళ్లి దామోదర్ బృందం, రాణిరుద్రమదేవి నృత్యప్రదర్శన సుధీర్‌రావు బృందం ప్రదర్శించింది. పెండ్యాల లక్ష్మీప్రియ బాలపురస్కార్ అవార్డు గ్రహీను ఘనంగా సన్మానించారు. అనంతరం కళాకారులను శాలువాలతో సన్మానించారు. కోటలో గవర్నర్ పర్యటనలో భాగంగా స్పెషల్ పార్టీ, వరంగల్ సీపీ అంబర్‌కిషోర్ ఝా ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు భారీ బందోబస్తు

వరంగల్ కోట సందర్శనలో గవర్నర్

నిర్వహించారు. సాయంత్రం 6గంటలకు వచ్చిన గవర్నర్ 7.10 వరకు కోటను సందర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్, శిశుసంక్షేమ శాఖా మంత్రి దనసరి అనసూర్య సీతక్క, బీసీ సంక్షేమశాఖా మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, బల్దియా కమిషనర్ అశ్వినితానాజీ వాకడే, కేంద్ర పురావస్తుశాఖ డిప్యూటీ సూపరింటిండెంట్ డాక్టర్ హెచ్‌ఆర్ దేశాయ్, జిల్లా అధికారి మల్లేశం, పర్యాటక శాఖ జిల్లా అధికారి శివాజీ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ నాయకులు వన్నాల వెంకటరమణ, కుసుమ కుతీష్, సీపీ అంబర్ కిషోర్ ఝా, కార్పొరేటర్లు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.





ఖిలా వరంగల్ కోటలో పేరిణి నృత్య ప్రదర్శన

గవర్నర్‌కు స్వాగతం పలికిన కొండా

కోటకు వచ్చిన గవర్నర్‌కు మధ్యకోటలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు ఘనస్వాగతం పలికారు. బొకే ఇచ్చి, సత్కరించారు. 37,38 డివిజన్‌ల కార్పొరేటర్లు వెల్పుగొండ సువర్ణ-సురేష్, బైరబోయిన ఉమా-దామోదర్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ కేడల పద్మ-జనార్దన్ స్వాగతం పలికారు.



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న కొండా మురళీధర్‌రావు

సుస్థిరాభివృద్ధిపై దృష్టి పెట్టాలి

(5వ పేజీ తరువాయి)

నిర్వహణ, తడి, పొడి చెత్త నిర్వహణ, బయోమైనింగ్ ప్లాంట్ ఏర్పాటు, కాళోజీ కళాక్షేత్రం నిర్మాణం తదితర అంశాలను వివరించారు. అలాగే వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిస్థితిని సీపీ అంబర్ కిశోర్ ఝా వివరించారు. అనంతరం జిల్లాలోని వివిధరంగాలకు చెందిన సుప్రసిద్ధ కవులు, కళాకారులు, రచయితలు, జాతీయ, అంతర్జాతీయ అవార్డులు పొందిన క్రీడాకారులు, సామాజిక కార్యకర్తలు, పలు రంగాలకు చెందిన ప్రముఖులతో గవర్నర్ భేటీ అయ్యారు. వివిధ అంశాలపై వారితో ముచ్చటించారు.

వరంగల్ విశిష్ట నగరం

వరంగల్ అనేక ప్రాచీన దేవాలయాలు, వారసత్వ కట్టడాలు ఉన్న సుప్రసిద్ధ, చారిత్ర నగరమని, భవిష్యత్తులో మరింత సుస్థిరాభివృద్ధిని సాధించాలన్న ఆకాంక్షను గవర్నర్ వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో తనకు తన ప్రిన్సిపల్ సెక్రెటరీ బి.వెంకటేశం నగర విశిష్టత, చారిత్రక నేపథ్యం గురించి తెలిపారని, వ్యవసాయరంగంలోనూ జిల్లా ముందుండాలని ఆకాక్షించారు. పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యమిస్తున్నందుకు అధికారులను అభినందించారు. మంగళవారం ములుగు జిల్లా పర్యటనలో భాగంగా తాను ములుగులోని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించానని, ఆస్పత్రి ఎంతో పరిశుభ్రంగా ఉండడం తనను ఆకట్టుకుందన్నారు. జిల్లాల్లో అంగన్వాడీ కేంద్రాల ఉన్నతీకరణకు అధికారులు తీసుకుంటున్న చర్యలను గవర్నర్ స్వాగతించారు. కాకతీయులు ఏలిన గడ్డ ఓరుగల్లులో పర్యటించడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో అంతా యువ అధికారులే ఉన్నారని, వీరి నేతృత్వంలో అభివృద్ధి మరింత శరవేగంగా జరుగుతుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఇక్కడి చారిత్రక కట్టడాలను చూసేందుకు ఈ జిల్లాలకు మరోసారి వస్తానన్నారు. ప్రజలు తమ సమస్యలపై తనను స్వేచ్ఛగా కలవవచ్చునని, రాజ్‌భవన్ ద్వారాలు సదా తెరిచి ఉంటాయని గవర్నర్ స్పష్టం చేశారు.

గవర్నర్‌కు ఘన స్వాగతం

హనుమకొండ, వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం ఎన్‌ఐటీ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, మేయర్ గుండు సుధారాణి, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామి రెడ్డి, సీపీ అంబర్ కిశోర్ ఝా, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్యశారదా, కార్పొరేషన్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే, డీఎఫ్‌వోలు అనుజ్ అగర్వాల్, లావణ్య, ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, అదనపు కలెక్టర్ సంధ్యారాణి పుష్పగుచ్ఛాలు అందచేసి ఘనస్వాగతం పలికారు. అనంతరం ప్రజాప్రతినిధులతో గవర్నర్ కొద్ది సేపు సమావేశం అయ్యారు. వరంగల్, హనుమకొండ జిల్లా అభివృద్ధి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చారిత్రకంగా ఈ రెండు జిల్లాల ప్రాశస్త్యం గురించి ఆసక్తిగా ఆరా తీశారు.

సాంస్కృతిక కళా రంగంలో ఓరుగల్లు స్థానం అద్భుతం

ఉమ్మడి జిల్లా జిల్లా ప్రముఖులతో గవర్నర్

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 28: తెలంగాణ ప్రాంతంలోనే సాహిత్య, సాంస్కృతిక కళారంగాల్లో ఓరుగల్లు స్థానం అద్భుతమని, భిన్నరంగాల ప్రముఖులను కలుసుకోవడం ఆనందంగా ఉందని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. హనుమకొండ కలెక్టరేట్‌లో బుధవారం మధ్యాహ్నం ఉమ్మడి జిల్లాకు చెందిన భిన్న రంగాల ప్రముఖులను ఆయన పరిచయం చేసుకున్నారు. ఒక్కొక్కరిని పేరుపేరునా ప్రస్తావిస్తూ కళా, సాహిత్య ఇతర రంగాలలో వారి కృషిని ప్రశంసించారు. ప్రముఖ నవలా రచయిత అంపశయ్య నవీన్, రామా చంద్రమౌళి, డాక్టర్ లంక శివరామప్రసాద్, పొట్లపల్లి శ్రీనివాసరావు, అన్వర్, ప్రముఖ పాత్రికేయుడు, రచయిత గడ్డం కేశవమూర్తి, కార్టూనిస్టు నెల్లుట్ల రమాదేవితో మాట్లాడారు. ప్రముఖ మిమిక్రీ కళాకారుడు లోహిత్ కుమార్, జాతీయ నృత్యకళాకారిణులు వెంపటి శ్రావణి, కాట్రగడ్డ హిమాన్సీ, పేరిణి నృత్యాన్ని జాతీయస్థాయిలో ప్రదర్శిస్తున్న గజ్జెల రంజిత్‌కుమార్, నాటక రంగ ప్రముఖుడు వనం లక్ష్మీకాంతరావు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జ్యోతిరావు, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, డాక్టర్ శేషుమాధవ్, కాళీచరణ్, క్రీడారంగం నుంచి సారంగపాణి, ఎం.డి.అజీజ్‌ఖాన్, మహిళా శక్తి అవార్డు గ్రహీత కొంగ రజిని, సామాజిక రంగం నుంచి మండల పరశురాములు, చేనేత రంగం నుంచి జాతీయ అవార్డు గ్రహీత పిట్టల రాములు, తదితర 40 మంది ప్రముఖులను గవర్నర్ కలుసుకున్నారు. వారితో కలిసి భోజనం చేశారు.



రచయిత, కార్టూనిస్టు రమాదేవితో మాట్లాడుతున్న గవర్నర్

6న హాజరు కావాలని సీపీకి హైకోర్టు నోటీసులు

వరంగల్ క్రైం, ఆగస్టు 28: ఉద్యోగ విరమణ పొందిన కానిస్టేబుల్ పెన్షన్ విషయంలో సీపీ అంబర్ కిషోర్ ఝాకు రెండు రోజుల కిందట హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహించిన యాదాద్రి అనే కానిస్టేబుల్ 2020లో ఉద్యోగ విరమణ పొందారు. ఈ క్రమంలో పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోగా, అతడి భార్య సంతకం కావాలని కమిషనరేట్ అధికారులు సూచించారు.

కుటుంబ కలహాలతో యాదాద్రి భార్య కేసు వేసిందనే కారణంతో పెన్షన్ జారీ విషయంలో కమిషనరేట్ అధికారులు జాప్యం చేశారు. పెన్షన్ జాప్యం కావడంతో కానిస్టేబుల్ కోర్టును ఆశ్రయించారు. దీంతో పెన్షన్ చెల్లించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కమిషనరేట్ కార్యాలయం నుంచి స్పందన లేకపోడంతో కానిస్టేబుల్ మరోసారి కోర్టును ఆశ్రయించారు. సీపీని కానీ, ఆయన తరఫున న్యాయవాది హాజరు కావాలని హైకోర్టు నోటీసులు జారీ చేసింది.

నేడు డయల్ యువర్ డీఎం

బాలసముద్రం, ఆగస్టు 28: హనుమకొండ డిపోలో గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు హనుమకొండ డిపో మేనేజర్ భూక్య ధరమ్‌సింగ్ బుధవారం ఒకప్రకటనలో తెలిపారు. హనుమకొండ డిపో పరిధిలోని జమ్మికుంట, వేలేరు, ఐనవోలు, పర్వతగిరి, సంగెం, ఖిలా వరంగల్, హనుమకొండ, హసన్‌పర్తి, కమలాపూర్, వరంగల్, కాజీపేట మండలాల పరిధిలోని గ్రామాల ప్రజలు ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు 9959226049కు ఫోన్ చేయాలని కోరారు.

బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి 20ఏళ్ల జైలు

వరంగల్ లీగల్, ఆగస్టు 28: రెండో తరగతి చదువుతున్న బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.20వేల జరిమానా విధిస్తూ వరంగల్ జిల్లా పోక్సో ప్రత్యేక న్యాయస్థానం, 2వ అదనపు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి మణిషా శ్రవణ్ ఉన్నమ్ బుధవారం తీర్పుచెప్పారు. బాధితురాలికి రూ.10లక్షలు నష్టపరిహారం చెల్లించాల్సిందిగా ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా ఉన్నాయి.

వరంగల్ రామన్నపేటకు చెందిన బాలికను నమ్మించి వరంగల్ పట్టణ పాపయ్యపేట చమన్ ప్రాంతానికి చెందిన రామరూపుల ప్రభుచరణ్ చెట్ల పొదలోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. దీన్ని గమనించిన బాలిక తల్లిదండ్రులు మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు.. నిందితుడిపై పోక్సో చట్టం నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితుడు ప్రభుచరణ్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.20వేల నగదు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీలు పి.రఘు, శ్రీనివాస్, లైజన్ అధికారి ఎం.వెంకటస్వామి సాక్షులను ప్రవేశపెట్టారు. భరోసా లీగల్ అధికారి సీహెచ్. నీరజ కేసులో సహకరించారు. దర్యాప్తు అధికారులుగా ఎస్‌హెచ్‌వో టి.గోపి, ఏసీపీ డి.చంద్రయ్య వ్యవహరించారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ సత్యనారాయణ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మర్రి వాసుదేవరెడ్డి కేసు వాదించారు.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ట	క్వింటా కనిష్ట
మక్కలు (బిల్టీరకం)	2,911	2,700
పల్లికాయ (సూక)	6,300	5,400
పల్లికాయ (పచ్చిది)	4,000	3,000
కందులు	8,552	8,552
పెసళ్లు	6,252	2,552
పత్తి	7,560	5,000
పసుపు (కాడి)	12,459	10,000
పసుపు (గోల)	12,059	11,409
తేజ మిర్చి	12,000	8,000
తేజ ఏసీ	17,500	15,000
వండర్‌హాట్ ఏసీ	16,000	13,000
యూఎస్341 ఏసీ	14,500	11,000
తాలు మిర్చి	6,000	3,000

- వరంగల్ వ్యవసాయం

తెలుగు వర్సిటీకి పాల్కురికి పేరు పెట్టాలి

తెలంగాణ ఆదికవికి పట్టం కట్టడం చారిత్రక అవసరం

సాహిత్యంలో బహుజనులకు స్థానం కల్పించింది సోమనాథుడే

సీఎం రేవంత్‌రెడ్డికి సాహితీ వేత్తలు, కవుల విజ్ఞప్తి



పాలకుర్తి, ఆగస్టు 28 : తెలంగాణ ఆదికవి, బహుభాషా కోవిధుడు సాహిత్యంలో అనేక ప్రక్రియలకు ఆద్యుడు పాల్కురికి సోమనాథుడు. తెలుగు, సంస్కృతం, కన్నడం, మలయాళం, మరాఠీ, తమిళం లాంటి భాషల్లో ప్రావీణ్యం కలిగిన ఆయన తెలంగాణ ప్రాంతానికి కీర్తి ప్రతిష్టలను తెచ్చి దేశవ్యాప్తంగా పరిచయం అక్కరలేని కవిగా గుర్తింపు పొందాడు. అలాంటి కవికి స్వరాష్ట్ర ప్రభుత్వం పట్టం కట్టాల్సిన చరిత్రక అవసరం ఉందని సాహితీవేత్తలు, కవులు కోరుకుంటున్నారు. దేశ ప్రథమ కవుల్లో ఒకరైన 11వ శతాబ్దానికి చెందిన పాల్కురికి సోమనాథుడిది ప్రస్తుత జనగామ జిల్లా పాలకుర్తి ఆయన స్వగ్రామం. బసవ పురాణం, వృశాధిప శతకం, పండితారాధ్య చరిత్ర లాంటి అనేక ప్రాముఖ్య గ్రంధాలు రాశాడు. పాల్కురికి సోమనాథుడికి ఆయన రాసిన సాహిత్యంపై పాలక వర్గాలు అనేక దశాబ్దాలుగా శీతకన్ను చూపుతున్నాయి. తెలంగాణ ప్రాంతానికి చెందిన కవిగా నిర్లక్ష్యానికి అవహేళనకు, ప్రాంతీయతకు గురయ్యారు. అది నేటికీ కొనసాగుతూ వస్తోంది. ఆయనను కేవలం వీరశైవ సాహిత్యానికి పరిమితం చేసి చరిత్ర కారులు సాహిత్య వేత్తలు తీవ్ర అన్యాయం చేశారు. అనువాద కవులకిచ్చిన ప్రాధాన్యం స్వతంత్ర కవులకు ఇవ్వడం లేదన్న బలమైన విమర్శ ఉంది. సోమనాథుడు సకల ఆధిపత్యాలను తిరస్కరించిన తొలి తెలుగు కవి. అణగారిన తరగతులకు తీవ్ర వివక్షకు గురవుతున్న శ్రామిక జనాలకు సాహిత్యంలో స్థానం కల్పించిన విప్లవ కవి సోమనాథుడు. దేశీయతకు పట్టం కట్టి నూతన ఒరవడులకు జీవం పోశాడు. సంప్రదాయాలను కాలదన్ని సమానత్వం చాటి చెప్పాడు. సమాజ మార్పును ఆకాంక్షించాడు. ఆ రోజుల్లో అది విప్లవకరమైన పరిణామం. అలాంటి సోమనాథుడి సమగ్ర సాహిత్యాన్ని విస్తృతంగా వెలుగులోకి తేవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అయితే ఆగస్టు 2న అసెంబ్లీలో సురవరం ప్రతాపరెడ్డి పేరును ప్రస్తావించిన సీఎం రేవంత్‌రెడ్డి అందరూ ఆమోదం తెలిపితే తెలుగు విశ్వవిద్యాలయానికి ప్రతాపరెడ్డి పేరు పెడతామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో కొన్ని వర్గాల నుంచి పాల్కురికి సోమనాథుడి పెరు పెట్టాలని ప్రతిపాదనలు వచ్చాయి. పాలకుర్తికి చెందిన సోమనాథ కళాపీఠం లాంటి సంస్థ స్పందించి పాలమూరు విశ్వవిద్యాలయానికి లేదా మీడియా అకాడమీకి సురవరం ప్రతాపరెడ్డి పేరును సూచించింది. అయితే ఈ కాంక్ష ఇప్పటిది కాదని తెలంగాణ మలిదశ ఉద్యమంలో తెలంగాణ ఆదికవిగా పాల్కూరికి సోమనాథుడిని గుర్తించాలని ఈ ప్రాంతానికి చెందిన మేధావులు, కవులు, రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

సోమనాథుడి పేరు పెట్టాలి

మామిండ్ల రమేష్‌రాజా, కవి, రచయిత పాలకుర్తి,



తెలుగు విశ్వవిద్యాలయానికి పాల్కురికి సోమనాథుడి పెరు పెట్టాలి. స్వరాష్ట్రంలో పాలకులు పెడుతారని తెలంగాణ ఉద్యకారులు, సాహితీ వేత్తలు, ఆశించారు. రాష్ట్రం ఏర్పడి దశాబ్దం కాలం పూర్తయినప్పటికీ పట్టించుకున్న పరిస్థితి లేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా తెలుగు యూనివర్సిటీకి పాల్కురికి సోమనాథుడి పేరు నామకరణం చేస్తే సముచిత గౌరవం ఉంటుంది.

ఇతర వ్యక్తుల పేర్లు పెడితే తప్పిదం జరిగినట్లే

వీరమనేని వెంకటేశ్వర్‌రావు, సోమనాథ కళాపీఠం బాధ్యుడు, పాలకుర్తి



హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయానికి ఇతర వ్యక్తుల పేర్లు పెట్టినట్లయితే ఉమ్మడి పాలకులు చేసిన తప్పిదాన్ని కొనసాగించినట్లే అవుతుంది. తెలంగాణ ఆది కవి, తొలి తెలుగు స్వతంత్ర కవి, విప్లవ కవి పాల్కురికి సోమనాథుడి పేరు మాత్రమే సమంజసమైంది.

సోమనాథుడి పేరు పెట్టడమే సమంజసం

రాపాక సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, పాలకుర్తి



తెలుగు విశ్వవిద్యాలయానికి బసవపురాణం గ్రంథకర్త పాల్కురికి సోమనాథుడి పేరు పెట్టడమే సరైన నిర్ణయం. రాష్ట్రంలో ఇంకా మిగిలి ఉన్న యూనివర్సిటీలకు సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టాలి. బడుగు వర్గాల కష్టాలను సాహిత్యంలో స్థానం కల్పించిన సోమనాథుడికే ఆ పట్టం దక్కాలి.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : సీఐ

మరిపెడ, ఆగస్టు 28: తోపుడు బండ్ల వ్యాపారులు, పండ్ల వ్యాపారులు, బడ్డి కోట్ల వ్యాపారులు, ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే చర్యలు ఉంటాయని మరిపెడ సీఐ రాజ్‌కుమార్ గౌడ్ హెచ్చరించారు. బుధవారం మరిపెడలోని కార్గిల్ సెంటర్ నుంచి రాజీవ్‌గాంధీ సెంటర్ వరకు 365 జాతీయ రహదారికి ఇరువైపుల మునిసిపల్ సిబ్బందిచే వ్యాపార కేంద్రాల ముందు మార్కింగ్ ఏర్పాటు చేయించి చిరువ్యాపారులు, ఆటో డ్రైవర్లకు సీఐ కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సైలు సతీశ్, సంతోశ్, మునిసిపల్ కమిషనర్ వెంకటస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల సంబురాలు

పెద్దవంగర, ఆగస్టు 28 : సుప్రీం కోర్టులో ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరు చేయడంతో మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు బాణ సంచా కాల్చి సంబురాలు నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవిత ఏ తప్పు చేయలేదని, రాజకీయ కక్ష సాధింపుతోనే జైలుకు పంపారని అన్నారు. కాంగ్రెస్, బీజేపీలు బీఆర్ఎస్‌ను ఎదుర్కోలేక ఇలాంటి చర్యలకు పాల్పడ్డారని తెలిపారు. అక్రమ కేసులో ఆధారాలే లేకుండా అరెస్టు చేసి జైలుకు తరలించారన్నారు. కార్యక్రమంలో పాలకుర్తి దేవస్థాన మాజీ చైర్మన్ వి.రామచంద్రయ్య శర్మ, శ్రీరాం సంజయ్, కనుకుంట్ల వెంకన్న, దుంపల సమ్మయ్య, రఘు, భాస్కర్, రాజేందర్, పటేల్‌నాయక్, భీమా, హరీశ్, రాంమూర్తి, భిక్షపతి, వెంట్రామయ్య శ్రీను, కుమారస్వామి, రమేశ్, సతీశ్, రవి, సుభాష్, రామరాజు పాల్గొన్నారు.

కాలనీల్లో పిచ్చిమొక్కలపై గడ్డిమందు పిచికారీ

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 28: 'సీపీఐ వార్డు బాట..ప్రజా మాట' కార్యక్రమంలో భాగంగా మహబూబాబాద్ పట్టణంలోని 23వవార్డు పరిధిలోని సీపీఐ, సింగు నర్సయ్య శ్రీరాంభద్రయ్య కాలనీల్లో బుధవారం భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) ఆధ్వర్యంలో పిచ్చిమొక్కలకు గడ్డి మందు కొట్టారు. సీపీఐ జిల్లా నాయకుడు చింతకుంట్ల వెంకన్న స్వయంగా పంపును భుజాన వేసుకుని కాలనీల్లో రోడ్డు కిరువైపులా ఉన్న పిచ్చి మొక్కలపై మందును పిచికారి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాలనీల్లో చెత్తాచెదారం పేరుకుపోయి దోమలు వ్యాప్తి చెంది ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నప్పటికి పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదని వాపోయారు. వార్డులో అనేక సమస్యలు నెలకొన్నా పరిష్కారంలో విఫలమయ్యారని విమర్శించారు. కార్యక్రమంలో ఆలేటి మహేశ్, ఎర్రోజు పద్మ, బీమరాజు వెంకన్న, సునిత, మాంజీ నాయక్, భాగ్యమ్మ, వసంత, సౌజన్య, శ్రీనివాస్, సునిత పాల్గొన్నారు.

విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్యం కోసమే వాటర్ ప్లాంట్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 28: విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు వాటర్ ప్లాంట్‌ను బహూకరిస్తున్నట్లు దాత నామిరెడ్డి సీతారాంరెడ్డి అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ పరిధిలోని జమాండ్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ.50వేల విలువగల వాటర్ ప్లాంట్‌ను బుధవారం సీతారాంరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. తన తల్లిదండ్రులు నామిరెడ్డి పార్వతమ్మ-వెంకట్‌రెడ్డిల జ్ఞాపకార్థం విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు వాటర్ ప్లాంట్‌ను అందించినట్లు చెప్పారు. పాఠశాలలో బాలుర మూత్రశాలల నిర్మాణానికి రూ.లక్ష ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. కాగా, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్, ప్రధానోపాధ్యాయులు పాఠశాలకు గ్రంథాలయ వసతిని కల్పించాలని సీతారాంరెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు బాబురావు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బెస్ట్ ఫోక్ లిరిక్ రైటర్ అవార్డు గ్రహీతకు సన్మానం

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 28 : తెలంగాణ బెస్ట్ ఫోక్ లిరిక్ రైటర్ అవార్డు గ్రహీత, జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ అయిలి సంతోష్‌ను ఘనంగా సత్కరించారు. ఇటీవల తెలంగాణ బెస్ట్ ఫోక్ లిరిక్ రైటర్ అవార్డును అందుకున్న సంతోష్‌ను జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సలహాదారు బి.విజయసారథి, అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బి.అజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ.. అయిలి సంతోష్ మరెన్నో అవార్డులు అందుకుని ఈప్రాంత ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోచ్ మెతుకు కుమార్, తోట వినయ్‌కుమార్, నక్క నాగార్జున, శ్రీనివాస్, బి.ధర్మచరణ్‌రెడ్డి, చిన్మయి, తరుణ్, ఈశ్వర్, వర్షిత్ పాల్గొన్నారు.

రుణమాఫీ రాని వారికోసం గ్రామాలకే అధికారులు

▸▸ నేటి నుంచి జీపీల్లో కుటుంబ నిర్ధారణ

కేసముద్రం, ఆగస్టు 28: రేషన్‌కార్డు, తదితర సమస్యలతో రూ.2 లక్షల లోపు రుణమాఫీ అమలు కాని రైతుల కోసం ఈనెల 29 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు మండలంలోని గ్రామాలకే వ్యవసాయాధికారులు వస్తారని మండల వ్యవసాయాధికారి బి.వెంకన్న బుధవారం తెలిపారు. ఈనెల 29న ఉప్పరపల్లి, ఇంటికన్నె, కాట్రపల్లి, 30న కల్వల, తాళ్లపూసపల్లి, అన్నారం, 31న ధన్నసరి, నారాయణపురం, మహమూద్ పట్నం, కోరుకొండపల్లి, సెప్టెంబరు 2న పెనుగొండ, బేరువాడ, రంగాపురం గ్రామాల జీపీ కార్యాలయాల వద్దకు కుటుంబ నిర్ధారణ కోసం అధికారులు వస్తారని తెలిపారు. రుణమాఫీకాని రైతులు తమ కుటుంబ స్వీయ ధ్రువీకరణ పత్రాన్ని కార్యదర్శి సంతకంతో సమర్పించాలని చెప్పారు. కుటుంబసభ్యుల ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్ కాపీలను తీసుకురావాలని తెలిపారు. వ్యవసాయాధికారి సమక్షంలో కుటుంబాన్ని నిర్ధారిస్తూ 'క్రాప్ లోన్ వేవర్' యాప్‌లో ఏవోతో కలిసి సెల్ఫీని అప్‌లోడ్ చేస్తే వారికి త్వరలోనే రుణమాఫీ వస్తుందని తెలిపారు. ఈ మేరకు స్థానిక రైతు వేదికలో కేసముద్రానికి చెందిన పలువురు రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించి యాప్‌లో సెల్ఫీదిగి అప్‌లోడ్ చేశారు.



కేసముద్రంలో రుణమాఫీ అమలు కాని రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న ఏవో వెంకన్న

నేడు మానుకోటలో ధర్మజాగరణ

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 28 : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్వీఎం ఫంక్షన్ హాల్‌లో గురువారం ఉదయం 10.30 గంటలకు ధర్మజాగరణ ఆధ్వర్యంలో మహిళా సమ్మేళనం నిర్వహించనున్నట్లు బీజేపీ మహిళా నాయకురాలు దార ఇందుభారతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మత మార్పిడి ముఠాలు టార్గెట్ చేసేది మహిళలను, గర్భిణులను అని, ఈ కార్యక్రమానికి మీ ఇంటి ఆడబిడ్డల్ని, తల్లులను, కుమార్తెలను, భార్యలను తప్పకుండా తీసుకురావాలని పిలుపునిచ్చారు. దీనికి ముఖ్య అతిథిగా అమర లింగన్న హాజరై సందేశం వినిపిస్తారని ఆమె పేర్కొన్నారు.

ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



కేసముద్రం విలేజ దర్గా ఉర్సు ఉత్సవాల్లో ఎమ్మెల్యే మురళీనాయక్

కేసముద్రం, ఆగస్టు 28: కేసముద్రం విలేజీలోని హజ్రత్ జాన్‌పాక్ అమీరొద్దీన్ బాబా దర్గా ఉర్సు ఉత్సవాల్లో బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్, ఉమ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు దర్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మంగళవారం రాత్రి సందల్, ఖవ్వాలి కార్యక్రమాలు జరుపగా మరుసటి రోజు ఫాతియా నిర్వహించారు. ఈ ఉర్సు ఉత్సవాలకు జిల్లాతోపాటు వరంగల్, హైదరాబాద్ ప్రాంతాలకు చెందిన పలువురు భక్తులు హాజరయ్యారు.

డీఈవోను కలిసిన ఉపాధ్యాయ సంఘాలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 28: మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖాధికారిగా బాధ్యతలుస్వీకరించిన వి.రాజేశ్వర్‌ను వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో సత్కరించారు. జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయంలో బుధవారం పీఆర్‌టీయూ-టీఎస్, ఆర్‌యూపీపీటీఎస్ బాధ్యులు వేర్వేరుగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీఈవో రాజేశ్వర్ మాట్లాడుతూ... జిల్లాను విద్యారంగంలో అగ్రస్థానంలో నిలిపేందుకు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో పీఆర్టీయూ-టీఎస్ నాయకులు సంకా భద్రినారాయణ, మురళీధర్ స్వామి, కళ్లెంవెంకట్‌రెడ్డి, బి.రామోజీనాయక్, హల్యానాయక్, ఆర్‌యూపీపీటీఎస్ నేతలు మడిపెల్లి రమేశ్, కొలిపాక శ్రీనివాస్ పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

డోర్నకల్, ఆగస్టు 28: మండలంలో రైతులు పశువుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని మండల పశువైద్యాధికారి నాగేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని హున్యతండా గ్రామపంచాయతీ పరిధిలో లంపీస్కిన్ వ్యాధి సోకిన పశువులకు బుధవారం చికిత్స నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లంపీస్కిన్ వ్యాధి ఒక పశువు నుంచి మరో పశువుకు దోమలు, ఈగల ద్వారా వ్యాపిస్తుందన్నారు. అందుకోసం పశువుల యజమానులు వాటికి దోమ తెరలు వాడాలని సూచించారు. లంపీస్కిన్ వ్యాధి వల్ల లేగదూడల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని, పశువుల యజమానులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి రైతు పశువులకు టీకాలు వేయించాలన్నారు.

ధ్వజస్తంభం ప్రతిష్ఠించే వరకు అమెరికా వెళ్లను

▸▸ ఎన్ఆర్ఐ పులి ప్రమీలరెడ్డి

గార్ల, ఆగస్టు 28: మండల పరిధిలోని మర్రిగూడెం సమీపంలో గల శ్రీ వేట వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠించే వరకు తాను అమెరికా వెళ్లనని ఎన్ఆర్ఐ పులి ప్రమీలరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం వేట వేంకటేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. గాలి దుమారానికి కూలిపోయిన ధ్వజస్తంభం స్థానంలో వేద పండితుల వేదమంత్రోచ్ఛరణ నడుమ మరలా ధ్వజస్తంభం ఏర్పాటు చేయాలని దాతలు లక్షల రూపాయలు విరాళాలు అందజేయడంతో ఏర్పాట్లు పూర్తి చేశారన్నారు. దేవాదాయ కమిటీ, ఆలయ అధికారుల ప్రత్యేక ఆహ్వానం మేరకు తాను అమెరికా నుంచి వచ్చానని తెలిపారు. గ్రామ రాజకీయాలను దేవాలయానికి రుద్ది ధ్వజస్తంభం ప్రతిష్ఠకు అవరోధాలు సృష్టించడం దురదృష్టకరమన్నారు. దేవాలయం అభివృద్ధికి రూ.కోటి విరాళం అందించిన తనను పిలిచి అవమానించడం సరికాదని కన్నీటి పర్యంతమయ్యారు. సమావేశంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

బయ్యారం, ఆగస్టు 28:స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన 30 చెక్కులు, కళ్యాణలక్ష్మి పథకంలో మంజూరైన 61 చెక్కులను ఇల్లెందు ఎమ్మెల్యే కోరెం కనకయ్య లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. పెద్దచెరువు తూము వద్ద పూజలు నిర్వహించి నీటిని విడుదల చేశారు. కొత్తపేట సమీపంలో ప్రధాన పంట కాల్వ మరమ్మతు పనులను పరిశీలించారు. ఆయన వెంట డీసీసీ ప్రధాన కార్యదర్శి భూక్య ప్రవీణ్‌నాయక్, సొసైటీ చైర్మన్ మూల మధుకర్‌రెడ్డి, తిరుమల ప్రభాకర్‌రెడ్డి, వేల్పుల శ్రీనివాస్‌రెడ్డి, సనప సోమేష్ మోహన్, పి.వెంకటేశ్వర్లు, బాబా, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



బయ్యారం పెద్దచెరువు నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కోరెం కనకయ్య

ముఖ్యమంత్రి సహాయ నిధి బాధితులకు వరం

కురవి: ముఖ్యమంత్రి సహాయ నిధి బాధితులకు వరం లాంటిదని కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి అవిరె మోహన్‌రావు అన్నారు. కురవిలో బుధవారం పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు బాలగాని శ్రీనివాస్, బాదె వీరభద్రం, బానోత్ తుకారంనాయక్, బెడద వీరన్న, దైద భద్రయ్య పాల్గొన్నారు.

మహిళా శక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మహబూబాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మహిళా శక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. మహబూబాబాద్‌లోని కలెక్టరేట్‌లో బుధవారం డీఆర్‌డీఏ, సెర్ప్ అధికారులతో మహిళా శక్తి పథకం అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ఇందిరా మహిళాశక్తి పథకం ముఖ్య ఉద్దేశ్యమని, దీన్ని జిల్లాలో దిగ్విజయంగా అమలు చేయాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల ద్వారా సూక్ష్మ పరిశ్రమలు, వ్యాపారాలను ప్రోత్సహించి సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళల ఆర్థిక స్వావలంబనకు సహకరించడం, సంఘాలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో, అదనపు డీఆర్‌డీఏ జయశ్రీ, డీపీఎం నళిని, శ్రీనివాస్, రాజు, మెప్మా డీఎంసీ విజయ, ఈడీఎం ప్రశాంత్ పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరంలో స్పాట్ ప్రవేశాలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 28: మహబూబాబాద్‌లోని ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు కల్పించేందుకు ఈనెల 30 నుంచి సెప్టెంబరు 2 వరకు స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.బలరాం బుధవారం తెలిపారు. జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూ) పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ప్రథమ సంవత్సరం సీఎస్ఈ(డేటా సైన్స్), ఈసీఈ, ఈఈఈ, ఎంఈ బ్రాంచిల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అర్హులైన విద్యార్థినీ, విద్యార్థులు టీజీఈఏపీసెట్ హాల్ టికెట్, ర్యాంకు కార్డు, ఎస్సెస్సీ, ఇంటర్ మెమో, అన్ని స్టడీ సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు టీసీ (అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో), ఫీజులతో హాజరు కావాలని సూచించారు. కన్వీనర్ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ప్రవేశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఇతర వివరాలకు 90000 49334, 97051 05317 నంబర్లను సంప్రదించాలన్నారు.

అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలి : ఎస్ఎఫ్ఐ

కొత్తగూడ, ఆగస్టు 28: కొత్తగూడలోని జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కోకన్వీనర్ గుగులోత్ సూర్యప్రకాష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సూర్యప్రకాష్ మాట్లాడుతూ కళాశాలలో హిస్టరీ లెక్చరర్ లేకపోవడంతో హెచ్ఈసీ విద్యార్థులు అవస్థలు పడుతున్నారని ఆవేదన చెందారు. ప్రభుత్వం తక్షణమే హిస్టరీ లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.8వేల కోట్ల స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనింగ్ కమిటీ సభ్యులు రాజేష్, మండల నాయకులు సంతోష్, రాకేష్, అఖిల్, వినయ్, నితీష్ పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి : టీఎస్ యూటీఎఫ్

డోర్నకల్, ఆగస్టు 28: సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ వివేక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం డోర్నకల్ మండలంలో టీఎస్‌యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా డోర్నకల్ జడ్పీ హైస్కూల్‌లో వివేక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని మేనిఫెస్టోలో పెట్టారని, ఆ హామీని వెంటనే అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, కార్యదర్శి శివప్రసాద్, నాయకులు సోమనబోయిన శ్రీనివాస్, సాహెబ్‌అలీ, శంకర్, రాములు, అమిన్, సీతారాములు, అమీనా, రేణుక, రాజేశ్వరి, సీతారామరావు తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చేవరకు పోరాటం

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 28: నాడు పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని జరిగిన పోరాటంలో అమరులైన వీరుల త్యాగాల స్ఫూర్తితో నేటి పాలకులు ఇచ్చిన హామీలు నెరవేర్చేవరకు పోరాడాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న అన్నారు. మహబూబాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద బషీర్‌బాగ్ అమరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. 24ఏళ్ల క్రితం ఉన్న అప్పటి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను భారీగా పెంచడంతో తగ్గించాలంటూ అఖిలపక్షం ఆధ్వర్యంలో శాంతియుతంగా ఆందోళన చేపడుతుంటే ఇనుప కంచెలు, గుర్రాలతో తొక్కించడమే కాకుండాకాల్పులు జరపగా ముగ్గురు అమరులయ్యారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం కోసం 420 హామీలు ఇచ్చారని, నేటి వరకు ఏ ఒక్క హామీని పూర్తి స్థాయిలో చేయలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, బండపల్లి వెంకటేశ్వర్లు, ఉమగాని సత్యం, పైండ్ల యాకయ్య, నర్సింహారావు, రంగయ్య, గౌతం, ప్రశాంత్, రవిశంకర్, రాజు పాల్గొన్నారు.



మహబూబాబాద్‌లో అంబేద్కర్ విగ్రహం ఎదుట అమరుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న చిన్న చంద్రన్న

అమరుల పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి

తొర్రూరు: నాడు బషీర్‌బాగ్ పోరాటంలో అమరులైన త్యాగాల స్ఫూర్తి తో నేటి పాలకుల హామీల అమలుకై ఉద్యమించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. బుధవారం డివిజన్ కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో విద్యుత్ అమరవీరులకు నివాళులర్పించి ఆయన మాట్లాడారు. నాటి పోరాటాల్లో ఎంతో మంది అమరులయ్యారని, వారి పోరాట ఫలితంగా ఆనాటి ప్రభుత్వానికి బుద్ధి చెప్పి గద్దె దించారని, నేటి పాలకులు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే మరోసారి ప్రజల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందన్నారు. అమరుల స్ఫూర్తితో ఉద్యమించాలని వామపక్ష పార్టీలు సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో విద్యుత్ అమరవీరులకు అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వీరన్న, అశోక్, భిక్షపతి, బందు మహేందర్, లక్ష్మణ్, సోమయ్య, యాకూబ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 28: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్రఉపాధ్యక్షుడు నరసింహారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లో బుధవారం సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలన్నారు. హాస్టల్ విద్యార్థులకు మెస్‌చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెండింగ్‌లో ఉండటం వలన అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బొట్ల గౌతమ్, అభి, శంకర్, దేవేందర్, మల్లికార్జున్,అభిలాష్, చరణ్, అఖిల్, నగేష్, ప్రశాంత్, నందు, రణధీర్, రాము, విఘ్నేష్, బాబు, సింగ్, సన్నీ, మౌలాలి, విష్ణు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి



విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న కిషన్ నాయక్

సీరోలు, ఆగస్టు 28: విద్యతోనే సమాజాభివృద్ధి జరుగుతుందని గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపకులు, పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు గుగులోతు కిషన్‌నాయక్ అన్నారు. మండలంలోని కొత్తూరు(సి) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, కలర్ బాక్సులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ఆర్థికంగా వెనుకబడిన వారేనన్నారు. ప్రభుత్వం వారికి ఉచిత పాఠ్యపుస్తకాలు అందిస్తుండగా తనవంతు సాయంగా నోటు పుస్తకాలు అందించడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో యూనిఫాం, మధ్యాహ్నభోజనం అందిస్తున్నారని, ప్రతి రోజు క్రమం తప్పకుండా విద్యార్థులను పాఠశాలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. హెచ్‌ఎం సింగం మనోహర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం శంకర్ నాయక్, హైస్కూల్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వీరన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ సభ్యత్వ నమోదు

గూడూరు, ఆగస్టు 28: మండలంలోని వివిధ పాఠశాలల్లో బుధవారం పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మయ్య, వెంకన్న మాట్లాడుతూ... ఉపాధ్యాయులతో కలిసి వారి సమస్యలపై ఉద్యమించనున్నట్లు చెప్పారు. సీపీఎస్ రద్దు, పెండింగ్ డీఏలు పరిష్కారించాలన్నారు. కార్యక్రమంలో రమేష్, రవిచంద్ర, కమలాకర్‌రెడ్డి, గోపి, చంద్రమౌళి, పగడయ్య, ద్రస్తు, మనోహర్, శ్రీధర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

జన విజ్ఞాన వేదిక మండల కమిటీ ఎన్నిక

పెద్దవంగర, ఆగస్టు 28 : జనవిజ్ఞాన వేదిక మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నికున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడిగా కొక్కుల శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా కవి రాజుకుమార్, కోశాధికారిగా మహ్మద్ యాకుబ్, ఉపాధ్యక్షులుగా యుగేందర్, రమేష్, సంధ్యారాణి, సంయుక్త కార్యదర్శిగా బొమ్మెర ఎల్లగౌడ్, సింహాద్రి, చెకుముకి కన్వీనర్లుగా సురేంద్రకుమార్, స్రవంతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుడు కొక్కుల శ్రీధర్ మాట్లాడుతూ సమాజాన్ని పట్టిపడిస్తున్నటువంటి మూఢవిశ్వాసాలను పారద్రోలడమే లక్ష్యంగా ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. తన నియామకానికి సహకరించి జిల్లా, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

వీవోఏలకు రూ.26వేల వేతనం ఇవ్వాలి

▸▸ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణవేణి, మౌనిక

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 28: ఇందిరా క్రాంతి పథం ద్వారా గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న వీవోఏలకు నెలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నీలం కృష్ణవేణి, చింత మౌనిక డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఫ్లైవర్ బ్రిడ్జి వద్ద నుంచి కలెక్టరేట్ వరకు బుధవారం ర్యాలీ నిర్వహించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గత బీఆర్ఎస్ ప్రభుత్వం వీవోఏల సమస్యలను పట్టించుకోలేదన్నారు. గ్రేడింగ్ పద్ధతిని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వీవోఏలకు మహిళా సంఘాల నుంచి ఇస్తున్న రూ.5వేల వేతనాన్ని నేరుగా తమ బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని విజ్ఞప్తి చేశారు. అర్హత ఉన్న వారికి సీసీలుగా పదోన్నతి కల్పించాలన్నారు. ఆరోగ్య బీమా కల్పించి ఆదుకోవాలన్నారు. తమ సమస్యలను పరిష్కరించని పక్షంలో ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆకుల రాజు, సుధాకర్, హన్మంతు, వసంత, శ్రీలత, లలిత, వీరన్న, కుమారస్వామి, అనిత తదితరులు పాల్గొన్నారు.

గణేష్ మండపాలకు అనుమతి తీసుకోవాలి

(5వ పేజీ తరువాయి)

ద్వారా అనుమతులు జారీ చేస్తారని చెప్పారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు లే కుండా గణేష్ మండపాలను చేసుకోవాలన్నారు. మండపం ఏర్పాటు చేసే స్థలం కోసం సంబంధిత శాఖల వారితో అనుమతులు తీసుకోవాలన్నారు. విద్యుత్ శాఖ అనుమతితోనే విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలన్నారు. షార్ట్‌సర్క్యూట్ జరుగకుండా నా ణ్యమైన వైర్లను ఉపయోగించుకోవాలన్నారు. గణేష్ మండపాల నిర్వాహకులు, కమి టీ వివరాలు, మండపాల వద్ద బాధ్యత వహించే వారి వివరాలు, ఫోన్ నంబర్లతో కూడిన ఫెక్సీలను మండపం వద్ద ఏర్పాటు చేయాలన్నారు. వృద్ధులు, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తక్కువ శబ్దకాలుష్యంతో సౌండ్ బాక్సులను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు రాత్రి 10 గంటల వరకు మాత్రమే సౌండ్‌సిస్టంకు అనుమతి ఉందని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ తెలిపారు. మండపాల్లో ఎట్టి పరి స్థితుల్లో డీజేను ఏర్పాటు చేయకూడదన్నారు. గణేష్ ప్రతిమలు ప్రతిష్ఠించే ప్రదేశం లో నాణ్యమైన విధంగా షెడ్డు ఏర్పాటుచేయాలన్నారు. మండపంలో 24గంటలు ఒక వలంటరీ ఉండే విధంగా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలన్నారు. భక్తుల సందర్శనను దృష్టిలో పెట్టుకుని క్యూలైన్‌లు ఏర్పాటు చేయడంతో పాటు వలంటీర్లను నియమించాలన్నారు. మండపాల వద్ద ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించినప్పుడు ముందు జాగ్రత్తలో భాగంగా రెండు బకెట్ల నీటిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపాల వద్ద మద్యం సేవించడం, పేకాట ఆడటం, లక్కీడ్రాలు నిర్వహించడం, అసభ్యకరమైన నృత్యాల ఏర్పాటు, అన్యమతస్తులను కించపరిచే విధంగా ప్రసంగాలు చేయడం, పాటలు పాడడం లాంటివి పూర్తిగా నిషేధమన్నారు. మండపాల వద్ద నోట్‌బుక్ ఏర్పాటు చేయాలని, పోలీసు అధికారులు తనిఖీకి వచ్చినప్పుడు అందులో రాసి సంతకాలు చేస్తారని చెప్పారు. మండపాల్లో ఏదైనా అనుమానాస్పదంగా బ్యాగులు, ప్లాస్టిక్ సంచులు, బాక్సులు, వస్తువులు లేదా వ్యక్తులు కనిపించినట్లయితే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

భర్తకు రెండో వివాహం

▸▸ అన్నీ తానై జరిపించిన మొదటి భార్య

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 28: ఓ భార్య అన్నీతానై తన భర్తకు రెండో వివాహం జరిపించిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జరిగింది. స్థానికులు, బంధువుల తెలిపిన వివరాల ప్రకారం.... మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లి గ్రామానికి చెందిన సురేష్‌కు పదేళ్ల క్రితం ఖమ్మం నగరానికి చెందిన సరితతో వివాహమైంది. వారికి కుమార్తె, కుమారుడు సంతానం. కాగా, మానుకోట పట్టణానికి చెందిన మానసిక దివ్యాంగురాలు సంధ్య తమకు దగ్గరి బంధువు అయిన సురేష్‌ను ఇష్టపడింది. అతడినే పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో ఇరు కుటుంబాల వారు చర్చించి ఓ నిర్ణయానికి వచ్చారు. ఈ క్రమంలో సురేష్ మొదటి భార్య సరిత దగ్గరుండి భర్త సురేష్, సంధ్యకు స్థానిక మార్కండేయ దేవాలయంలో బుధవారం వివాహం జరిపించారు. అయితే సరిత అన్నీ తానై వ్యవహరించి భర్తకు వివాహం జరిపించడం చర్చనీయాంశమైంది.

పర్యావరణంపై అవగాహన కల్పించాలి

▸▸ జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి దయానంద్



ప్రమాణం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

తొర్రూరు, ఆగస్టు 28: ప్రజల కోసం.. ప్రగతి కోసం.. పర్యావరణ పరిరక్షణ కోసం సైన్స్ అనే ఉన్నత ఆశయాలను జనవిజ్ఞాన వేదిక పరిచయం చేస్తుందని, పర్యావరణాన్ని పరిరక్షించడమే జనవిజ్ఞాన వేదిక లక్ష్యమని జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగంపల్లి దయానంద్ అన్నారు. బుధవారం తొర్రూరు పట్టణంలోని వికాస్ పాఠశాలలో మండల నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ పట్ల ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు, మౌలిక స్వరూప స్వభావాలను గురించి సవివరంగా పెంపొందిస్తామన్నారు. నూతన కమిటీ గౌరవ అధ్యక్షుడిగా రాయిపెల్లి యాకయ్య, అధ్యక్షుడిగా పెరుమాండ్ల రమేష్, ప్రధాన కార్యదర్శిగా కోటగిరి కుమార్, కోశాధికారిగా ఎ.వెంకన్నతో పాటు మరికొంత మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ముత్తిలింగం, రేణుక, సమత, ప్రేమలత, శ్రీధర్ రెడ్డి, బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.